

కొండగోర్జి ఆక్రమణ తొలగింపు

జెసిబితో ఆక్రమణలు తొలగిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని ఆర్.ఆమదాలవలసలో కొండగోర్జి భూ ఆక్రమణలను శుక్రవారం తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి జెసిబితో తొలగించారు. ఆమదాలవలసకు చెందిన కాగాన నాగభూషణరావు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రికార్డు ప్రకారం హద్దులు నిర్ణయించి, ఆక్రమణలు తొలగింపు ప్రారంభించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రేవతి ఉన్నారు.

2 నెలలు.. 6,086 ఇళ్లు

- సామూహిక గృహప్రవేశాలకు తాజాగా లక్ష్యం
- ఎంపిడిఒలు, కమిషనర్లు, ఇఇలకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం

పేదలందరికీ ఇళ్లు పథకంలో మంజూరు చేసిన ఇళ్లలో వచ్చే రెండు నెలల్లో 6,086 ఇళ్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సామూహిక గృహ ప్రవేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా 6,086 ఇళ్లు పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించిందని, ఈ మేరకు జూన్, జూలై నెలల్లో పూర్తిచేయాలని ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్‌లు, గృహనిర్మాణ శాఖ ఎఇలను ఆదేశించారు. జిల్లాకు సామూహిక గృహప్రవేశాల లక్ష్యంగా 30 వేల ఇళ్లను నిర్దేశించగా ఇప్పటికే పూర్తి చేశామని చెప్పారు. గృహ నిర్మాణంపై కలెక్టర్ శుక్రవారం జిల్లాలోని మండల, మున్సిపల్ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ప్రతి వారంలో 750 నుంచి 800 వరకు ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాల్సి వున్నందున సచివాలయం వారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని నిర్ణీత వ్యవధిలో పూర్తిచేయాలన్నారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిలో ఒక దశ నుంచి మరోదశకు ఇళ్లనిర్మాణం చేరడమే ముఖ్యమనే విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో గృహనిర్మాణ సంస్థ పీడీ ఎస్.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కడప జిల్లాలోని క్రీడా పాఠశాలలో 4,5 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాంగోపాల్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. 4వ తరగతిలో ప్రవేశం పొందగోరేవారు 8 నుండి 9 సంవత్సరాల వయసు (1.8.2014 నుండి 31.7.2015 మధ్య జన్మించిన వారు అర్హులు), 5వ తరగతిలో ప్రవేశానికి 9 నుండి 10 సంవత్సరాలు వయసు గల1.8.2013 నుండి 31.7.2014 మధ్య జన్మించిన వారు అర్హులు) బాలబాలికలు అర్హులని తెలిపారు. ప్రస్తుతం 3 వ తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలో గల 27 మండలాలు, 4 మునిసిపాలిటీలలో గల బాలబాలికలు మాత్రమే అర్హులని తెలిపారు. ఆధార్ కార్డు జిరాక్సు కాపీ, సంబంధిత మున్సిపల్ అథారిటీ/స్కూల్ యజమాన్యం జారీ చేసిన జనన, స్టడీ, కాండక్ట్ ధ్రువపత్రాలు, ఇటీవల తీయించుకున్న 6 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, కుల ధ్రువీకరణ ఉండాలని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు రాష్ట్రస్థాయి ఎంపికకు హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

1న యంత్ర సేవ

రూ.4.54 కోట్ల సబ్సిడీతో కస్టమ్స్ హైరింగ్ సెంటర్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఈనెల 1న 'యంత్రసేవ' కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా రూ.4.54కోట్ల సబ్సిడీతో కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటుకు ప్రభుత్వం తరపున సహకారం అందనుంది. ఆయా యంత్ర పరికరాలను ఇప్పటికే అందజేశారు. వాటికి సంబంధించిన సబ్సిడీని యంత్ర సేవ కార్యక్రమం రోజున రైతు సంఘాల ఖాతాల్లో ప్రభుత్వం జమచేయనుంది.

వ్యవసాయ యాంత్రీకరణ పెరుగుతున్న సంగతి తెలిసిందే. దీన్ని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతి ఆర్‌బికెలోనూ ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు నిర్ణయించిన విషయం విధితమే. 40 శాతం రాయితీపై ట్రక్కులు, దుక్కిసెట్లతో కూడిన ట్రాక్టర్లు, కలుపుతీత, వరికోత తదితర వ్యవసాయ యంత్రాలను ప్రతి ఆర్‌బికె పరిధిలోనూ ఐదు నుంచి ఆరుగురు రైతులకు రూ.15లక్షల విలువగల కస్టమ్ హైరింగ్ సెంటర్లు మంజూరు చేస్తోంది. ఇందులో 10శాతం లబ్ధిదారుడి వాటా కాగా 50శాతం బ్యాంకు రుణం మంజూరు చేస్తుంది. మిగిలిన 40శాతం ప్రభుత్వం సబ్సిడీ రూపంలో భరిస్తుంది. వీటిని తీసుకున్న రైతులు వారి సొంత అవసరాలకు ఉపయోగించుకోవడంతోపాటు స్థానికంగా వున్న ప్రైవేటు యంత్రాలకు తీసుకుంటున్న అద్దెకన్నా 10శాతం తగ్గింపుతో సేవలు అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. జిల్లాలో 500ఆర్‌బికెలు ఉండగా ఇప్పటి వరకు 326 ఆర్‌బికెల్లో రైతులు గ్రూపులుగా ఏర్పడి వీటిని తీసుకున్నారు. ఆయా హైరింగ్ కేంద్రాల రైతులకు సుమారు రూ.12కోట్ల సబ్సిడీ అందింది. మిగిలిన 184 ఆర్‌బికెల్లోనూ రైతు మిత్ర సంఘాలు ఏర్పడి కస్టమ్ హైరింగ్ సెంటర్ల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వీటిలో కొన్నింటికి ఇప్పటికే వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు పంపిణీ చేశారు. మరికొన్నింటికి పంపిణీ చేయాల్సివుంది. వీటిని పంపిణీ చేయడంతోపాటు మొత్తం హైరింగ్ సెంటర్లకు ప్రభుత్వ తరపు సబ్సిడీని ఈనెల 1న సబ్సిడీ విడుదల కానుంది. దీంతో, జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణ మరింతగా పెరగనుంది.

ఆధునిక యాంత్రీకరణతో మేలు

ఆధునిక యాంత్రీకరణ పద్ధతుల ద్వారా వ్యవసాయ రంగంలో మెగరుగైన దిగుబడులు సాధించడంతో పాటు సేద్యం మరింత సులభతరంగా ఉంటుంది. అందుకే ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ ప్రోత్సహిస్తోంది. ప్రతి ఆర్‌బికె పరిధిలో ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందులో భాగంగానే 184ఆర్‌బికెలకు ఇటీవల కస్టమ్ హైరింగ్ సెంటర్లు మంజూరు చేశాం. జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంకు ద్వారా ప్రభుత్వం మంజూరు చేస్తుంది.

- టి.రామారావు,
జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

పరిశ్రమలకు సకాలంలో అనుమతులు

విద్య, వైద్య సదుపాయాలకు సిఎస్ఆర్ ఫండ్స్ : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

పరిశ్రమలకు సకాలంలో అనుమతులు జారీ చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం కలెక్టరేట్ సమావేశమందిరంలో శుక్రవారం జరిగింది. జిల్లాలో కొత్త పరిశ్రమలు, పారిశ్రామిక వాడల స్థాపనకు ఉన్న అవకాశాలను, భూముల కేటాయింపు, ఇతర సమస్యలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల కోసం వచ్చిన దరఖాస్తులు ఏ శాఖ వద్దా పెండింగ్ ఉండకూడదని, నిర్ణీత కాలవ్యవధిలో వాటిని అనుమతించాలని స్పష్టం చేశారు. పరిశ్రమలు, ఎపిఐఐసి ఆధ్వర్యంలో పారిశ్రామిక వాడల స్థాపనకు పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడానికి తగిన చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. కొత్తవలస మండలం బలిఘట్టం, రెల్లి, పెదరావుపల్లి, కంటకాపల్లి గ్రామాల్లో ప్రతిపాదిత భూములను కేటాయించడానికి క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగిన చర్యలు చేపట్టాలని ఆర్‌డిఒను ఆదేశించారు. ఈ భూముల మ్యుటేషన్‌పైనా చర్చించారు. వివిధ పారిశ్రామిక క్లష్టర్ల ఏర్పాటుపై చర్చించారు. సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్షన్, రైస్‌మిల్ క్లష్టర్, బెల్లం క్లష్టర్, మామిడి తాండ్ర క్లష్టర్ తదితర ఏర్పాట్లను పరిశీలించాలని సూచించారు. వీటి ఏర్పాటుకు అధికారికంగా అనుమతులు తీసుకోవాలన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా వివిధ కంపెనీలు ఖర్చుచేసే సిఎస్ఆర్ నిధులపై చర్చించారు. కార్మికశాఖ, జిల్లా ప్రణాళికా శాఖ, కాలుష్య నియంత్రణ సంస్థ, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్, పరిశ్రమల శాఖ ద్వారా ఖర్చు చేసిన నిధులపై ఆరా తీశారు. ఈ నిధులను విద్య, వైద్య సదుపాయాల కల్పనకు వెచ్చించాలని సూచించారు. దీనికోసం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఆయా శాఖలు వెంటనే ఒక సమావేశాన్ని నిర్వహించి, ప్రతిపాదనలను తయారు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సుమారు రూ.98లక్షల విలువైన పారిశ్రామిక రాయితీలకు అనుమతించారు. చిన్న సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల స్థాపన కోసం ఎంఎస్ఎంఇ ఆధ్వర్యంలో ప్రతిపాదించిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటును పరిశీలించాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, ట్రైనీ కలెక్టర్ సహాదిత్ వెంకట త్రివినాగ్, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ ఆర్.పాపారావు, డిడి నాగేశ్వర్రావు, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

బిల్లులు సిద్ధం చేయండి

జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులన్నీ అప్‌లోడ్ చేసేందుకు సిద్ధం చేయాలని అధికారులను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశించారు. కొద్దిరోజుల్లో ప్రభుత్వం పెండింగ్ బిల్లులకు నిధులను విడుదల చేసే అవకాశం ఉందని చెప్పారు. నెల్లిమర్ల, చీపురుపల్లి, గజపతినగరం, బొబ్బిలి, ఎస్.కోట, విజయనగరం నియోజకవర్గాల్లో, గ్రామీణ ఉపాధిహామీ కన్వర్జెన్సీ నిధులతో జరుగుతున్న ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు, ఇతర నిర్మాణాల పెండింగ్ బిల్లులపై జెడ్‌పి సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఉపాధిహామీ కింద కన్వర్జెన్సీ నిధులతో పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతా పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఇవే కాకుండా వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ, నీటిపారుదల శాఖలకు సంబంధించిన పనులను కూడా నిర్వహించారని అన్నారు. ఈ పనులకు సంబంధించి ఇప్పటికే సుమారు రూ.38 కోట్ల బిల్లులను అప్‌లోడ్ చేయడం పూర్తి అయ్యిందని చెప్పారు. సుమారు మరో రూ.7 కోట్లు బిల్స్ అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. మరికొన్ని విభాగాల్లో బిల్లులు పెండింగ్ ఉన్నాయని, వాటిని కూడా రేపటిలోగా సిద్ధం చేయాలని ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన 24 గంటల్లో బిల్లులన్నీ అప్‌లోడ్ చేసేందుకు సిద్ధం చేయాలని, ఎక్కడా పెండింగ్ ఉండకూడదని చైర్మన్ స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ ఎం.అశోక్‌కుమార్, డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్, పంచాయతీరాజ్ ఎస్ఇ బిఎస్ఆర్ గుప్త, వివిధ శాఖల అధికారులు, ఎంపిడిఒలు, ఉపాధిహామీ ఎపిఒలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆ ఫ్లెక్సీలను తొలగించాలి

విజయనగరం టౌన్ : నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడుకు పల్లకి మోస్తున్నట్లు ముఖ్యమంత్రి జగన్ ఫొటోతో పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధం అని జనసైనికులను, పవన్ అభిమానుల మనోభావాలను కించపరిచేలా వేసిన ఫ్లెక్సీలు తక్షణమే తొలగించాలని జనసేన నాయకులు గురాన అయ్యలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎఎస్‌పి ఆస్మా పర్వీన్‌ను కలిసి వినతి అందజేశారు. పేరూ ఊరూ లేని ఈ ఫ్లెక్సీలు తక్షణమే తొలగించాలని కోరారు. ప్రజల్లో వైసిపి ప్రభుత్వంపై నమ్మకం రోజురోజుకూ సన్నగిల్లుతున్న తరుణంలో వేసిన ఫ్లెక్సీల్లో ..ఎవరూ వేయించారో చెప్పుకోలేక అటు... ఇటు కాకుండా చులకన రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదాడ మోహనరావు, ఎంటి రాజేష్,పవన్ కుమార్, బాబు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్తు సరఫరా

ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ సిజిఎం విజయలలిత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్(ఆపరేషన్స్) వి. విజయలలిత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇపిడిసిఎల్ పరిధిలోని ఐదు జిల్లాల్లో ఎక్కడ విద్యుత్ కోతలు లేవని, అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కరెంటు కోటాను అందిస్తుందని, రోజూవారీ సరాసరి 90 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉన్నప్పటికి కోతలు లేకుండా సరఫరా చేస్తున్నామని తెలిపారు. కేవలం సాంకేతిక సమస్యలతోనే సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని, సంస్థ పరిధిలో ఎక్కడా విద్యుత్ కోతలను అమలు చేయడం లేదని స్పష్టం చేసారు.

విజయనగరం జిల్లా బుడతనాపల్లిలో గురువారం ఉదయం కొద్దిసేపు ఎల్.టి సర్వీసు ఫిర్యాదుల పరిష్కారమై, ఎబి స్విచ్ ఆపు చేయడం వలన అంతరాయం కలిగిందన్నారు. తరచు విద్యుత్ అంతరాయాలు, అత్యవసర కోతలు విధించటం లేదని తెలిపారు. గురువారం 11 కెవి ఉడా ఫీడర్‌పై 14:42గంటలకు యూకలిప్టస్ చెట్టు కొమ్మలు పడడం వల్ల అదే ఫీడర్‌పై ఉన్న బిఆర్ అంబేద్కర్ గురుకుల కార్యాలయానికి కూడా విద్యుత్ అంతరాయం కలిగిన వెంటనే సిబ్బంది చెట్లు, కొమ్మలు తొలగించారని తెలిపారు. విద్యుత్తు సరఫరాలో సమస్యల పరిష్కారం కొరకు వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేసి పరిష్కారం పొందవచ్చని పేర్కొన్నారు.


APGVB
Registered Notice
చెల్లింపుటకై నోటీసు
తేది:24-05-2023
ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు
Kottavalasa
Kottavalasa village
VIZAINAGARAM District
ANDHRA PRADESH
M/s. RAMABAI MPS
KALLEPALLI
KALLEPALLI KALLEPALLI KOTHAVALASA
-535183

రమాబాయి గ్రూపునకు జారీచేసిన నోటీసు

రుణాలు చెల్లించాల్సిందే

- ద్వాక్రా గ్రూపులకు బ్యాంకు నోటీసులు
- మహిళల ఆందోళన
- హత్య కేసుతో తెరపైకి అక్రమాలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని కల్లేపల్లి పంచాయతీకి చెందిన వైఎస్ఆర్ క్రాంతి పథం బుక్ కీపర్ (విఒఎ) గోకాడ మహేశ్వరిని మరో విఒఎ గాడి చిన్నతల్లి హత్య చేసి జైలుపాలైన విషయం తెలిసిందే. ప్రస్తుతం చిన్నతల్లి ఆధ్వర్యంలో ఉన్న గ్రూపులకు బ్యాంకు నోటీసులు అందుతున్నాయి. ఈ హత్య కేసుతో రోజురోజుకు అనేక అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ఈ హత్యకు లావాదేవీలే కారణమని తెలుసుకున్న బ్యాంకర్లు తమకు నగదు చెల్లించలేదంటూ డ్వాక్రా గ్రూపులకు నోటీసులు జారీ చేశారు. దీంతో డ్వాక్రా గ్రూపు సభ్యులు వైకెపి కార్యాలయాన్ని ముట్టడించారు. గాంధీ బొమ్మ జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. అక్కడ నుంచి పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు.

కల్లేపల్లి గ్రామపంచాయతీ శివారు ఎస్‌సి కాలనీకి చెందిన డ్వాక్రా మహిళలకు నగదు చెల్లించాలంటూ కొత్తవలసలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు నోటీసులు జారీ చేసింది. తీసుకున్న రుణాలు చెల్లించినా మళ్లీ డబ్బులు కట్టాలని బ్యాంకు నోటీసులు అందడంతో డ్వాక్రా మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు శుక్రవారం డ్వాక్రా మహిళలు వైకెపి కార్యాలయాన్ని ముట్టడించారు. బీమాభాయ్-2 గ్రూపు సభ్యులు రూ.7.50 లక్షలు బ్యాంకు రుణం తీసుకున్నారు. పెండింగ్ లేకుండా ఇంత వరకు కట్టడంతో రూ.1.20 లక్షలు కట్టాల్సి ఉండగా, రూ.3.45 లక్షలు చెల్లించాలని ఎపిజివిబి బ్రాంచ్ నుంచి నోటీసు అందిందని ఆ గ్రూపు అధ్యక్షులు గొల్ల అప్పలనరసమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. బీమాభాయ్-1 గ్రూపు సభ్యులు కూడా రూ.7.50 వేలు బ్యాంకు రుణం తీసుకుని వడ్డీతో సహా పూర్తిగా కట్టినా, ఇంకా రూ.77 వేలు చెల్లించాలని బ్యాంకు నోటీసు పంపినట్లు అధ్యక్ష, కార్యదర్శులు జి.లక్ష్మి, జి.పెంటమ్మ వాపోయారు. ధనలక్ష్మి గ్రూపు సభ్యులు రూ 2 లక్షలు రుణం తీసుకుని పూర్తిగా కట్టినప్పటికీ రూ.26 వేలు చెల్లించాలని నోటీసు అందినట్లు సభ్యులు తెలిపారు. రమాబాయి గ్రూపు సభ్యులకు రూ.25 వేలు కట్టాలని నోటీసు అందింది. అంబేద్కర్ గ్రూపు రూ.6.80 లక్షలు రుణం తీసుకుని పూర్తిగా చెల్లించినా, మళ్లీ కట్టాలని ఒత్తిడి చేస్తున్నట్లు సభ్యులు ఆందోళన చెందుతున్నారు. తారకరామ గ్రూపు రూ.4 లక్షలు రుణం తీసుకుని 8 నెలలు కట్టినప్పటికీ మొత్తం చెల్లించాలని చెబుతున్నట్లు సభ్యులు కొట్యాడ పైడమ్మ తెలిపారు.

ఈ విషయంపై వైకెపి ఎపిఎం అప్పలనాయుడును వివరణ కోరగా లావాదేవీల విషయంలో రుణాలు మంజూరు చేసిన బ్యాంకర్లకే తప్ప తమకు ఎటువంటి సంబంధమూ లేదని బదులిచ్చారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసేందుకు డ్వాక్రా మహిళలు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పూర్తి వివరాలతో ఫిర్యాదు చేస్తే తీసుకుంటామని హెడ్ కానిస్టేబుల్ కొండబాబు చెప్పినట్లు వికాస్ గ్రూపు సభ్యులు గాడి వరలక్ష్మి తెలిపారు.

గాంధీ బొమ్మ వద్ద నిరసన తెలుపుతున్న డ్వాక్రా మహిళలు

గర్భం దాల్చిన నుంచే పర్యవేక్షణ

మాతా శిశు మరణాలపై కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

మహిళ గర్భం దాల్చిన నుండి ప్రసవం జరిగే వరకూ నిత్యం వారిని పర్యవేక్షించాలని తద్వారా మాతా శిశు మరణాలను అరికట్టాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. అవసరమగు పరీక్షలు జరపడం , మందులు వాడవలసి ఉంటే వారి కుటుంబ సభ్యులకు తెలపాలని అన్నారు. తల్లీ బిడ్డలు సురక్షితంగా ఉండేలా చూసే బాధ్యతను వైద్య అధికారులు, ఆశ, ఎఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తల బాధ్యత గా భావించాలని అన్నారు. శుక్రవారం కలెక్టర్ తన ఛాంబర్ లో మాతా శిశు మరణాల పై కేసుల వారీగా సమీక్షించారు. ఏప్రిల్ నుండి మే లోపల 2 మాతృ మరణాలు, 6 శిశు మరణాలు నమోదైనట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ రమణ కుమారి కలెక్టర్ కు వివరించారు. ఏ ఒక్క గర్భిణీ , శిశువు సరైన వైద్యం అందని కారణంగా మరణించరాదనీ అన్నారు. ఘోషసుపత్రి నుండి కెజిహెచ్ కు రిఫర్ చేసిన కేసులపై ఆరా తీసారు. ఇక్కడ లేనిది అక్కడ అదనంగా ఉండేది ఏంటని ఘోషా గైనకాలజిస్ట్ డాక్టర్ అరుణ కుమారిని ప్రశ్నించారు. చిన్న పిల్లల కోసం వెంటిలేటర్ ఇక్కడ లేనందున రిఫెర్ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. హైరిస్క్ ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి వారి కుటుంబ సభ్యులను కూడా అప్రమత్తం చేయాలని అన్నారు. మరణించిన వారి కుటుంభ సభ్యులతో కూడా మాట్లాడి మరణాలపైనా, అందించిన వైద్యంపైనా ఏమైనా అనుమానాలు ఉన్నాయా అని కలెక్టర్ ప్రశ్నించారు. జరిగిన వాస్తవాలను వారు వివరించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఇంచార్జ డిసిహెచ్ఎస్, ఐసిడిఎస్ పీడీ శాంత కుమారి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ఇఎస్ఐ ఉప వైద్యాధికారికి సిఐటియు వినతి



ఇఎస్ఐ ఉప వైద్యాధికారికి వినతినిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇఎస్ఐ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలని, సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని సిఐటియు నాయకులు శుక్రవారం ఆస్పత్రి ఉప వైద్యాధికారి యు.వెంకయ్యకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ.జగన్మోహన్, బి.రమణ మాట్లాడుతూ విజయనగరం ఇఎస్ఐ హాస్పిటల్ పరిధిలో 20 వేలమందికి పైగా కార్మికులు ఉన్నారని, వీరందరికీ సక్రమంగా వైద్యసేవలందించేందుకు తగినంత మంది వైద్యులు,సిబ్బంది ఇక్కడ లేరని అన్నారు. బొబ్బిలి, గరివిడి పైడి భీమవరం, చిట్టివలస డిస్పెన్సరీల నుంచి కూడా రిఫరల్ పై ఇక్కడికి వస్తున్నారని , వీరందరికీ మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా సిబ్బంది, సౌకర్యాలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. వేలకోట్ల రూపాయలు ఇఎస్ఐ కి కార్మికుల చెల్లిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డాక్టర్లు, సిబ్బంది ఖాళీల భర్తీకి కృషి చేయడం లేదన్నారు. విజయనగరం ఇఎస్ఐ హాస్పిటల్లో కంటి వైద్య నిపుణులు లేరని, వాచ్‌మేన్, రికార్డ్ అసిస్టెంట్, ఆరుగురు స్టాఫ్ నర్సులు లేకపోవడంతో ఉన్న వారిపైనే అధిక భారం పడుతోందన్నారు. ఇన్ పేషెంట్ సేవలకు అవకాశం లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులపై ఆధారపడాల్సి వస్తోందని అన్నారు. ఉపవైద్యాధికారి స్పందిస్తూ ఇఎస్ఐ కంటి వైద్య సేవలు వారంలో మూడు రోజులు అందించేందుకు ప్రయత్నిస్తామని, సౌకర్యాలు ఖాళీల భర్తీపై పై అధికారులకు తెలియజేస్తామని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జి. సింహాచలం, టిటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో డైరెక్టర్ అఫ్ వర్క్స్ అకౌంట్స్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ సిహెచ్‌కె మల్లేశ్వర్రావు శుక్రవారం జిల్లాలో పర్యటించారు. కలెక్టరేట్‌లోని పే అండ్ అకౌంట్స్ కార్యాలయాన్ని సందర్శించారు. బిల్లుల చెల్లింపు, ఇతర అంశాలను పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. క్రమశిక్షణ, అంకితభావంతో విధులను నిర్వహించాలని ఆయన కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన డైరెక్టర్ మల్లేశ్వర్రావుకు, జిల్లా అసిస్టెంట్ పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ ఎం.రామసుబ్బయ్య, జెపిఎఒ పి.బుచ్చిరాజు స్వాగతం పలికి, సత్కరించారు. ధవళేశ్వరం జెడిడబ్ల్యుఎ పి.శ్రీరామిరెడ్డి, విజయవాడ ఎపిఎఒ సిహెచ్ తిరుమలరావు కూడా డైరెక్టర్‌తో బాటు జిల్లాకు వచ్చారు. కార్యక్రమంలో జిల్లా పిఎఒ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ మల్లేశ్వరరావు

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సూర్యకళ

పశు అక్రమ రవాణాపై చర్యలు

ఆర్‌డిఒ సూర్యకళ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనుమతులు, ఎన్‌ఒసిలు లేకుండా పశువులను అక్రమంగా రవాణా చేసేవారి పై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ సూర్యకళ తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్ లో జంతు సంక్షేమ కమిటీ డివిజినల్ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ అక్రమ రవాణాను అరికట్టడానికి మండల స్థాయిలో ఎస్‌హెచ్‌ఒ, తహశీల్దార్, ఎంపిడిఒ అధ్వర్యంలో కమిటీ లను పటిష్ట పరిచి పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. గో సంరక్షణ కమిటీ అధ్యక్షులు లొగిశ రామకృష్ణ మాట్లాడుతూ సంతల్లో పశువుల కోసం కనీస సదుపాయాలు ఉండడం లేదని, మండల స్థాయి సమావేశాలు నిర్వహించాలని కోరారు. ఆర్‌డిఒ స్పందిస్తూ సంతల్లో పశువుల సంరక్షణకు అవసరమగు మౌలిక వసతుల కల్పన పై దృషి పెట్టాలన్నారు. వీధి కుక్కల్ని హింసాత్మకంగా చంపకుండా అనిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రాం ద్వారా వాటి సంతతిని నిరోధించాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సత్యనారాయణకు తెలిపారు. సమావేశంలో డిఎస్‌పి ఆర్. గోవింద రావు, డివిజినల్ పంచాయతీ అధికారి మోహన్ రావు, తహశీల్దార్ బంగార్రాజు, పశు సంవర్ధక శాఖ డిడి రామచంద్ర రావు, రూరల్ సిఐ తిరుపతి నాయుడు, డివిజినల్ పిఆర్‌ఒ జానకమ్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏజెన్సీలకు రూ.9.45 కోట్లు చెల్లింపు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ధాన్యం సహాయక ఏజెన్సీలకు చెల్లించాల్సిన పిపిసి కమీషన్ రూ.12.06 కోట్లకు గాను ఇప్పటికే రూ.9.45 కోట్లు చెల్లించామని జెసి మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ప్రజాశక్తిలో ' ధాన్యం కొను'గోల్‌మాల్' శీర్షికను వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన జెసి ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి చెల్లించాల్సిన హమాలీఛార్జీలు, కొనుగోలు ప్రక్రియ చేపట్టినందుకు ధాన్యం సహాయక ఏజెన్సీలకు పిపిసి కమీషన్ రేటులోనే కలిపి ఉంటుందని తెలిపారు. హమాలీ ఛార్జీలు సంబంధిత పిఎస్‌ఎలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు.

పైనాపిల్‌కు మార్కెటింగ్ సౌకర్యం

ప్రజాశక్తి - సీతంపేట

పైనాఫిల్ రైతులకు గిట్టుబాటు ధర కలిగేలా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని జిల్లా ఉద్యానశాఖ అధికారి కె.సత్యనారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం పైనాఫిల్ రైతులు, ఎన్జీవో సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిడిఎ పిఒ కల్పన కుమారి ఆదేశాల మేరకు రాష్ట్రంలో 66 రైతు బజార్లలో అమ్ముకొనేందుకు వీలుగా అనుమతులు తీసుకున్నామని తెలిపారు. ఈ రైతు బజార్లలో ఎక్కడైనా రైతులు తమ పంటను అమ్ముకోవచ్చన్నారు. అందరూ ఒకే రైతు బజార్ కాకుండా అన్ని రైతు బజార్లకు రైతులంతా వెళ్లేలా ప్రణాళిక వేసుకోవాలన్నారు. పంటను ఒకేసారి కాకుండా విడతల వారీగా కోసుకోవాలని అన్నారు. రైతు బజార్లలో అమ్ముకోవడానికి అవసరమయ్యే అనుమతులను ఈనెల 27 నుంచి ఐటిడిఎలోని ఉద్యానశాఖ సిబ్బంది ద్వారా తీసుకోవచ్చని అన్నారు. అనుమతులు కావాల్సిన వారు తమ సంఘం బ్యాంక్ పాస్ బుక్, రైతు ఆధార్ కార్డ్, ఒక ఫోటో తీసుకురావాలని సూచించారు. రైతు బజార్లలో అమ్ముకొనేటప్పుడు ఏమైనా ఇబ్బందులు వస్తే వెంటనే ఉద్యానశాఖ అధికారులకు సంప్రదించాలని కోరారు. సమస్యను ఐటిడిఎ పిఒ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటామని అన్నారు. సమావేశంలో డిహెచ్ఒ సత్యనారాయణ రెడ్డి, జిసిసి డిఎం జి.సంధ్యారాణి, వెలుగు ఎపిడి రమణ, ఉద్యానశాఖ అధికారులు అయంతి, అమరేశ్వరి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

భూఆక్రమణలను ఉపేక్షించేది లేదు

ప్రజాశక్తి-గజపతినగరం

ప్రభుత్వ భూముల ఆక్రమణలను ఉపేక్షించేది లేదని తహశీల్దార్ అరుణకుమారి అన్నారు. గజపతినగరం పంచాయతీ పరిధిలోని మల్లపు చెరువు వద్ద బి.నాగేశ్వరరావు తన స్థలం పక్కన ఉన్న పోరంబోకు వాగును ఆనుకొని 12 సెంట్లు స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు సోమవారం ఎం.రమణమ్మ స్పందనలో ఫిర్యాదు చేశారు. విచారణలో వాస్తవమని తేలడంతో వెంటనే విఆర్ఒలు శ్రీరామమూర్తి, జి.రాజేష్, విఆర్ఎ ఎల్.సునీత ఆక్రమణలు తొలగించినట్లు తహశీల్దార్ తెలిపారు. భూ ఆక్రమణలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

శిక్షణ ఇస్తున్న తహశీల్దార్ అరుణకుమారి

అందరికీ రేషన్ అందివ్వాలి

ప్రజాశక్తి-గజపతినగరం

అందరికీ రేషన్ అందివ్వాలని తహశీల్దార్ ఎం.అరుణకుమారి అన్నారు. శుక్రవారం గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, మెంటాడ మండలాల మొబైల్ డిస్ట్రిబ్యూటింగ్ వెహికల్స్ ఆపరేటర్లు 54 మందికి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేలిముద్రలు నమోదు కాకపోవడం వల్ల రేషన్ తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతుండటంతో వారి కోసం ఐరిస్ మిషన్లు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. వీటితో ఇక సమస్యకు పరిష్కారం దొరికిందనిన్నారు. వీటిని ఉపయోగించి వంద శాతం రేషన్ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సిఎస్‌డిటిలు డి.వి.రవిశంకర్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ, డిటి సన్యాసినాయుడు

వాలంటీర్లకు ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-వేపాడ

గ్రామ వాలంటీర్ల పోస్టుల భర్తీ కోసం శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థులను ఇఒపిఆర్‌డి సిహెచ్.సూర్యనారాయణ, ఉపతహశీల్దార్ సన్యాసినాయుడు ఇంటర్వ్యూ చేశారు.

బాధితులను ఆదుకున్న రెడ్‌క్రాస్

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల మంతినివలస కాలనీ చెందిన బచ్చల మోహనరావు ఇల్లు ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోవడంతో బాధితులుకట్టు బట్టలతో మిగిలారు. దీంతో విషయం తెలుసుకున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు శుక్రవారం వారి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, టార్పాలిన్ అందజేసి ఆదుకున్నారు. కార్యక్రమంలో కళింగ వైశ్య రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకోట సురేష్, కురుపాం కళింగ వైశ్య సంఘం అధ్యక్షులు కొత్తకోట రవీంద్ర కుమార్, వర్తక సంఘం అధ్యక్షులు బరాటం గుంపస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సిని సందర్శించిన డిఇఒ

కురుపాం : డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ శుక్రవారం స్థానిక ఎమ్మార్సీని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఇఒ ఎన్.సత్యనారాయణతో మాట్లాడుతూ మండలంలో ఇంత వరకు జరిగిన నాడు-నేడు పనుల స్థితిగతులు మొదటివిడతలో పూర్తయిన పాఠశాల వివరాలు, రెండవ పేజీలో ప్రస్తుతం జరుగుతున్న పాఠశాలల పనుల వివరాలు తెలుసుకోవాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

వీరఘట్టం : మండలంలోని చలివేంద్రి పంచాయతీ పరిధి మహదేవివలస సమీపాన ఎస్.వెంకట్రావు నాయుడు పంట పొలాల్లో ఏర్పాటు చేసిన 16కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీ చేశారు. శుక్రవారం గ్రామస్తులు ట్రాన్స్‌కో ఎఇ బాలాజీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఎఇ బాలాజీ ఫిర్యాదు చేశారు. ఇది ఇలా ఉండగా మండలంలోని చిట్టిపూడి వలస జంక్షన్ వద్ద గల ట్రాన్సార్మ్‌లో విలువైన సామాగ్రిని చోరీ జరిగింది. ఈ విషయాన్ని బయటికి రాకుండా విద్యుత్తు అధికారులు గోప్యంగా ఉంచినట్టు తెలిసింది.

శిఖపరువు వైపు కదులుతున్న డొంక

- మైనింగ్ తవ్వకాల కోసం అధికారులపై ఒత్తిడి
- వైసిపి పెద్దలే సూత్రధారులు

శిఖపరువు కొండలు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని పట్టుచెన్నూరు పంచాయతీ పరిధిలో గల శిఖపరువు మైనింగ్ కొండపై మళ్లీ బడాబాబుల దృష్టి మళ్ళింది. కొద్ది సంవత్సరాల క్రితం ఇక్కడ తవ్వకాల కోసం ప్రయత్నించి విఫలమైన కాంట్రాక్టరు అకాల మరణం చెందారు. ఆయనతో ఆర్థిక సంబంధా లున్న అధికారపార్టీ అగ్రనేత ఒకరు ఇప్పుడు శిఖపరువు మైనింగ్ తవ్వకాలకు పావులు కదుపుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. శిఖపరువు గ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న మాంగనీస్ కొండపై చాలాకాలంగా బడాబాబులు దృష్టి సారించారు. ఈ ప్రాంతంలో తవ్వకాలకు సంబంధించి శిఖపరువు గ్రామస్తుల అభిప్రాయం సేకరణ చేపట్టారు. పర్యావరణ, రెవెన్యూశాఖల అధికారుల ఆధ్వర్యాన ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడానికి ప్రయత్నం చేశారు. అయితే సిపిఎం ఆధ్వర్యాన శిఖపరువు గిరిజనులు తీవ్రంగా ప్రతిఘటించారు. దీంతో ఆ ప్రతిపాదన అటకె క్కింది. ఇప్పుడు మళ్లీ ఆ ప్రతిపాదన తెరపైకి వస్తోంది. కొద్దిరోజుల క్రితం అటవీశాఖ చీఫ్ కన్సర్వేటర్ శ్రీరంగనాథ్‌రెడ్డి శిఖపరువు మైనింగ్ కొండను పరిశీలించారు. స్థానిక అటవీశాఖ అధికారులు సిబ్బందితో కలిసి ఆయన ఈ ప్రాంతం లో పర్యటించడంపై గిరిజనులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రా - ఒడిశా వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒకటైన పట్టుచెన్నూరు పంచాయతీ పరిధిలో శిఖపరువు గ్రామం ఉంది. ఇది పూర్తిగా అన్ సర్వే ప్రాంతంలో ఉంది. ఇలాంటి ప్రాంతంలో ఎలాగైనా మాంగనీస్ మైనింగ్ తవ్వకాలు చేయాలనే యోచనలో బడాబాబులు ఉన్నారు. అధికారపార్టీకి చెందిన కీలకమంత్రి ఒకరు శిఖపరువు మైనింగ్ తవ్వకాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంతంలో కొన్ని మైనింగ్ తవ్వకాలకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేసింది. ప్రభుత్వానికి ఆదాయం రాబట్టుకోవడానికి గ్రామ సభలు నిర్వహించకుండానే అనుమతులు మంజూరు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో శిఖ పరువు మైనింగ్ తవ్వకాలకు సంబంధించి చాపకింద నీరులా బడాబాబులు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ఆక్రమణకు గురవుతున్న బందను చూపిస్తున్న కోటగిరి నర్సింగరావు

కోటవారిబంద ఆక్రమణ

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో ఉన్న ప్రభుత్వ స్థలాలు, చెరువులు, బందలకు రక్షణ లేకుండా పోతోంది. పట్టణంలో భూముల ధరలకు రెక్కలు రావడంతో ప్రభుత్వ స్థలాలు, చెరువులు, బందలపై అక్రమార్కుల కళ్లు పడుతున్నాయి. రాజకీయ పలుకుబడితో ఆక్రమణలకు పాల్పడుతున్నారు. పట్టణంలోని తారకరామ కాలనీకి ఆనుకుని ఉన్న కోటవారిబంద ఆక్రమణకు గురవుతోంది. కోటవారిబందను 1956లో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న బంద శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు ఎదురుగా రాష్ట్రీయ రహదారి నుంచి తారకరామకాలనీ శివారు వరకు ఉంది. బందను కొంతమంది అక్రమార్కులు కప్పేసి అక్రమించేసి సొమ్ము చేసుకునేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. బంద ఆక్రమణలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు కోటగిరి నర్సింగరావు కోరుతున్నారు.

'గడపగడపకు'లో సమస్యల వెల్లువ

సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేస్తున్న మహిళ

ప్రజాశక్తి-భోగాపురం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలు వెల్లువెత్తాయి. కాలువల్లేవని, రహదారులు లేవని తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇల్లు ఉన్న వారికే మళ్లీ ఇల్లు ఇస్తున్నారని, నిరుపేదలకు అందడం లేదని పలువురు నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ముందు తమ గోడు వెలిబుచ్చారు. శుక్రవారం మండలంలోని రావాడ పంచాయతీ చినరావాడ, గొల్లపేట గ్రామాల్లో గడపగడపకు కార్యక్రమాన్ని రెండో రోజు నిర్వహించారు. గడపగడపకు ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలు తమ గ్రామంలో కనీస సౌకర్యాలు లేవని, తాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. కాలువలు లేక మురుగునీరు రోడ్లపైనే నిలుస్తుందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, వైస్ ఎంపిపి రావాడ బాబు, సర్పంచ్ అపరబక్త పైడినాయుడు, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్లు మైలపల్లి నరసింహులు, వైసిపి నాయకులు పడాల భాను, పడాల శ్రీనివాసరావు, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సుందర హరీష్, రామ్మూర్తి, కర్రోతు శ్రీనివాసరావు, సీతంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనం ప్రారంభం

మండలంలోని రావాడలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభించారు. రూ.8 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. కార్యక్రమంలో సిడిపిఒ తవిటినాయుడు, సూపర్‌వైజర్ శాంతిలత, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

'గడపగడపకు..'లో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-మెంటాడ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర తెలిపారు. మండలంలో పోరాం గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా నాలుగేళ్లలో అందిన ఆర్థిక సాయాన్ని వివరించారు. అర్హులైన వారికి అన్ని ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా కృషి చేస్తానన్నారు. అర్హులై ఉండి పథకాలు అందకపోతే వెంటనే సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, జెడ్‌పిటిసి లెంక సన్యాసి అప్పలనాయుడు, లెంక రత్నాకర్, సర్పంచ్ రాగోలు వీరమ్మ, ఎంపిటిసి చెల్లూరి సునీత, మెంటాడ, జక్కువ పిఎసిఎస్ అధ్యక్షులు తాడ్డి రామచంద్రరావు, రెడ్డి అప్పారావు, ఎంపిడిఒ త్రివిక్రమరావు, తహశీల్దార్ ఆదిబాబు, ఎపిఎం దేవుడుబాబు, ఎఒ గోకులకృష్ణ పాల్గొన్నారు.

వాలంటీర్ వ్యవస్థ కీలకం

ఎమ్మెల్సీ రఘురాజు

ప్రజాశక్తి-కొత్తవలస

కుల, మతాలకు తావులేకుండా వాలంటరీ వ్యవస్థ పనిచేస్తోందని, ఇది దేశానికే తలమానికమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. శుక్రవారం కొత్తవలస మండలం తుమ్మికాపల్లి సచివాలయంలో తుమ్మికాపల్లి, వీరభద్రపురం, వియ్యంపేట సచివాలయాల పరిధిలో ఉత్తమ సేవలందించిన వాలంటీర్లకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంచం, అవినీతికి తావులేకుండా వాలంటీర్ వ్యవస్థ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, సర్పంచులు విరోతి కొండలరావు, గేదెల రాములమ్మ, ఎంపిటిసి లక్ష్మి, నాయకులు సాయిబాబా, ఎంపిడిఒ వై.పద్మజ, ఇఒపిఆర్‌డి ధర్మారావు పాల్గొన్నారు.

వేపాడ : బొద్దాం సచివాలయంలో బొద్దాం, పాటూరు, కెజిపూడి సచివాలయాల పరిధిలో ఉత్తమ సేవలందించిన వాలంటీర్లను ఎమ్మెల్సీ రఘురాజు సత్కరించి, పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగన్నాథం, సర్పంచులు డి.లక్ష్మి, నాగిరెడ్డి కనకరాజు, యర్రా సన్యాసిరావు, దుల్లా పూర్ణకుమారి, వైస్ సర్పంచ్ వెంకటరావు, గంగునాయుడు, నాయకులు ఎ.వెంకటరావు, వర్రి సింహాద్రి అప్పడు, వెంకటరావు పాల్గొన్నారు.

వాలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

నెల్లిమర్ల : నగర పంచాయతీ పరిధిలో మొయిద జంక్షన్ 1, 2, గాంధీనగర్ వార్డు సచివాలయాల్లో ఉత్తమ సేవలందించిన వాలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్ కె.వి.కృష్ణారావు, వైసిపి పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు పాల్గొన్నారు.

బొబ్బిలి : వాలంటీర్ వ్యవస్థతో ప్రజలకు సేవ చేసే అదృష్టం కలిగిందని 5, 6 వార్డుల వాలంటీర్లు అన్నారు. మూడో సచివాలయంలో శుక్రవారం 5, 6 వార్డుల వాలంటీర్లకు సన్మానం చేశారు. మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ ఇంటి వద్దకు సంక్షేమ పథకాలు అందించేందుకు వాలంటీర్ వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, జెసిఎస్ కన్వీనర్ విస్సు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యతేది?

ప్రజాశక్తి-వేపాడ

సోంపురం జంక్షన్ నుంచి వేపాడ మీదుగా ఆనందపురం జంక్షన్ వరకు సుమారు 19 కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.39 కోట్లు మంజూరు చేసింది. ఈ పనుల్లో నాణ్యతా లోపం, అధికారుల పర్యవేక్షణ లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఇటీవల రోడ్డు పనులు చేపట్టిన వెంటనే పెచ్చులూడిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా మట్టితో నిర్మించిన బెర్మలు కూలిపోతున్నాయి. చిన్నపాటి వర్షానికే జగ్గయ్యపేట, అరిగిపాలెం మధ్య రోడ్డుకు ఇరువైపులా బెర్మలు జారిపోయాయి. ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు వీటిని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. రోడ్డు నిర్మాణ పనులు ఎంత నాసిరకంగా చేపడుతున్నారో, ఏ విధంగా ప్రజాధనం వృథా అవుతుందో.. అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా నాణ్యతా ప్రమాణాలు పాటించి రోడ్డు నిర్మిస్తే కొంతకాలమైనా ఈ రోడ్డుపై ప్రయాణం సాగించుకోవచ్చని, లేదంటే అంతే సంగతని ఆందోళన చెందుతున్నారు.

కూలిపోయిన బెర్మలు

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కేసలి

ప్రజాశక్తి-గుర్ల

మండలంలో తాతావారికిట్టలిలో అంగన్వాడీ కేంద్రాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు శుక్రవారం సందర్శించారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా పోలీస్, ఆరోగ్య కార్యకర్త తరుచుగా కేంద్రాన్ని పర్యవేక్షించాలని, వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో పిల్లల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఇద్దరు నిరుపేదల బాలికలకు గ్రామ సర్పంచ్ బెల్లాన మంగమ్మ నిత్యావసర వస్తువుల కోసం కొంత మొత్తాన్ని చైర్మన్ అప్పారావు ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఐసిడిఎస్ సిడిపిఒ ఆరుద్ర, జిల్లా మిషన్ వాత్సల్య సిబ్బంది వై.నాగరాజు, సంధ్య, మహిళా పోలీస్ బోగి నీలిమ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న కేసలి అప్పారావు

ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం

ప్రజాశక్తి-గుర్ల

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో ప్రణాళికను సిద్ధం చేసినట్టు ఎఒ తిరుపతిరావు తెలిపారు. శుక్రవారం 'ప్రజాశక్తి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడుతూ మండలంలో పది వేల ఎకరాలలో వరి సాగుచేస్తున్నట్లు చెప్పారు. వరి విత్తనాలు 2859 క్వింటాళ్లు అవసరమన్నారు. జిల్లా కేంద్రం నుంచి 1704 క్వింటాళ్లు కేటాయించినట్లు తెలిపారు. 24 రైతు భరోసా కేంద్రాలకు 1198 మెట్రిక్ టన్నుల యూరియా, 622 మెట్రిక్ టన్నుల డిఎపి, 416 మెట్రిక్ టన్నుల ఎంఒపి అవసరమన్నారు. వరి సాగు చేస్తున్న ప్రతిరైతూ తప్పనిసరిగా ఇ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. దీని ఆధారంగా విత్తనాలు, ఎరువులు కేటాయింపు చేయనున్నట్లు చెప్పారు. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టిసారించాలన్నారు. పంట ఆరోగ్యకరంగా ఉంటే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. వ్యవసాయ అధికారుల సలహాల మేరకు పురుగుల మందులు వినియోగించాలని చెప్పారు.

ఎఒ తిరుపతిరావు

నగర పంచాయతీలో మెప్మా బజార్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలోని మొయిద జంక్షన్‌లో శుక్రవారం మెప్మా బజార్‌ను ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శనగా ఉంచారు. ఈ ప్రదర్శనను నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని ప్రారంభించారు. మెప్మా బజార్‌లో పలువురు వస్తువులను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కె.వి.కృష్ణారావు, కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, వైసిపి పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, మెప్మా సిఎంఎం డి.గోవిందరావు, టిఎల్ఎఫ్ ప్రెసిడెంట్ కనకల హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

మెప్మా బజార్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సరోజిని

వార్డుల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని రాజానగర్ కాలనీ, నమియర్ వేణు మిల్లు వెనుక వైపు, రత్నాలనగర్, బలిజిపేట రోడ్డు, మార్కెట్ యార్డు ప్రాంతాల్లో కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం పర్యటించారు. బొబ్బిలి-బలిజిపేట రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇటీవల మార్చిన కుళాయిలకు డమ్మీలు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా బండారు వీధి ప్రజలకు తెలియజేశారు. నంబియార్ వేణు మిల్లు వెనుక వీధుల్లో సేకరించిన చెత్తను పారిశుధ్య కార్మికుడు రోడ్లపైన పారేస్తున్నట్టుగా గుర్తించి, ఆయన్ను విధుల నుంచి తాత్కాలికంగా నిలుపుదల చేయాలని కమిషనర్ ఆదేశించారు. పర్యవేక్షణ కొరవడినందున సంబంధిత వార్డు శానిటేషన్ సెక్రటరీకి ఛార్జి మెమో జారీ చేశారు. రాజానగర్ కాలనీలో పందుల పెంపకందారులతో చర్చించి పందులను ఊర్లోకి రానివ్వకుండా చూడాలని సూచించారు. రాజానగర్ కాలనీలో జీడిపిక్కలను కాలుస్తున్న వారితో మాట్లాడి, వాయు కాలుష్యం లేకుండా చూడాలన్నారు.

కుళాయి పైపులైను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు